క్లుప్తంగా

సెంచూరియన్‌ను సందర్శించిన విద్యా సంస్థల ప్రతినిధులు



వర్సిటీ చాన్సలర్ రాజుతో మాట్లాడుతున్న కళాశాలల ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని విశాఖకు చెందిన ప్రముఖ విద్యా సంస్థల ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. సెంచూరియన్‌లో ఉన్న సౌకర్యాలు గురించి వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రయోగశాలలు, జైరోప్లేన్, ఆప్టోమెట్రీ, రేడియాలజీ, ఏఆర్, వీఆర్ ల్యాబ్, ఫారెన్సిక్ ల్యాబ్, తదితర వాటిని సందర్శించారు. కార్యక్రమంలో సిల్వర్ ఓక్ స్కూల్ ప్రతినిధులు ఈశ్వరరావు, గిరీష్, గౌరీ పీజీ కళాశాల కరెస్పాండెంట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తిగీతాలాపన



భక్తి గీతాలాపన చేస్తున్న వాగ్దేవీ కళాసమితి ప్రతినిధులు లక్ష్మి, త్రినాథ్, తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక మూడులాంతర్లు వద్ద ఉన్న పైడితల్లి ఆలయ ఆవరణలో ఉన్న ఆధ్యాత్మిక కళావేదికపై మంగళవారం రాత్రి వాగ్దేవీ కళాసమితి నిర్వహణలో పతివాడ త్రినాథ్ స్వామి బృందం ఆలపించిన పైడితల్లి అమ్మవారి భక్తి గీతాలాపన ఆద్యంతం ఆకట్టుకుంది. గాయకులు గంటా లక్ష్మి, లక్ష్మీనారాయణ ఆలపించిన ట్రాక్ పాటలు రక్తి కట్టించాయి. అనంతరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డీవీవీ.ప్రసాదరావు కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఏడుకొండలు, మణికంఠ, రమేష్ పట్నాయక్, సాయి కిరణ్ శర్మ, శంబరి కృష్ణశర్మ, ఆర్.సూర్యపాత్రో, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేదవిద్యా వ్యాప్తికి హవనం



సామవేద కౌథుమ శాఖ సంహిత హవనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠంలో సామవేద కౌథుమ శాఖ సంహితా హవనం మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్వ టీటీడీ వేదపారాయణులు గణేషన్ శ్రౌతి ఆధ్వర్యంలో వేద విద్యార్థులు, పండితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కెవిఎస్.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం వేద విద్యా వ్యాప్తి కోసం హవనం టీటీడీ ఆధ్వర్యంలో చేపట్టామన్నారు. ఈ నెల 26న భారీ వేద సభ నిర్వహిస్తున్నామన్నారు. వివిధ పాఠశాలల నుంచి, ప్రాంతాల నుంచి, పుణ్యక్షేత్రాల నుంచి దాదాపు 50 మంది వేదపండితులు కార్యక్రమానికి హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో టీటీడీ వేదపండితులు సుందర రామశ్రౌతి, శ్రీకృష్ణశ్రౌతి, రాజేష్, పంచాపకేశన్, వేదపండితులు కృష్ణప్రసాద్, తేజ, పవన్ కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకారం



ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత అప్పలనాయుడు

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం గ్రామానికి చెందిన గౌరీశంకర్ ట్రేడర్స్ యజమాని ముల్లు అప్పలనాయుడు ఆర్థిక సహాయం చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు చీపురుపల్లి పట్టణంలో మంగళవారం రూ.50,116 నగదును దాత అందజేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, దిలీప్‌కుమార్ ధనూకా, గొల్లస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బొండపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీరాజ్ నిధులతో మండలంలోని అంబటివలసలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీడీఓ ఎస్.హరిహరరావు మంగళవారం పరి శీలించా రు. సచివాలయ భవనం,రైతు సేవా కేంద్రాల భవనం వద్ద నిర్మించిన రక్షణగోడతో పాటు, గ్రామంలో చేపట్టిన సిమెంట్‌రోడ్డు పనులను పరిశీలించారు. పనులకు ఎంత ఖర్చు చేశారు, నాణ్యతా ప్రమాణాలపై సచివాలయ కార్యదర్శితో పాటు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆరా తీశారు.

నగరంలో డెంగీ కలకలం

- ఒకే రోజు బయటపడ్డ మూడు కేసులు
- అప్రమత్తమైన కార్పొరేషన్ యంత్రాంగం
- కేసులు నమోదైన ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్
- పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశం



పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: జిల్లా కేంద్రంలో డెంగీ వ్యాధి కలకలం రేపుతుంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒకే రోజు మూడు కేసులు బయట పడటంతో కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తమైంది. నగరంలోని కాటవీధి, కేఎల్‌పురం ప్రాంతానికి చెందిన ఇద్దరు చిన్నారులతో పాటు జొన్నగుడ్డి ప్రాంతానికి చెందిన మరొకరికి డెంగీ సోకినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం వ్యాధి సోకిన వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా వ్యాధి సోకిన వారు విశాఖలోని ఓ విద్యా సంస్థకు చెందిన హాస్టల్‌లో ఉంటున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. నగరంలో అటువంటి వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, ఈ మేరకు ప్రజారోగ్య అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

కమిషనర్ పర్యటన

కాలానుగుణ వ్యాధులకు దోమలే ప్రధాన కారణమని, వాటి నియంత్రణ బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు పేర్కొన్నారు. డెంగీ కేసు నమోదైన కాటవీధి, కేఎల్‌పురం, జొన్నగుడ్డి తదితర ప్రాంతాలలో పర్యటించి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లో దోమలు వృద్ధి కాకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలను కోరారు. నిరంతరం దోమల నియంత్రణకు తాము అన్ని విధాలా చర్యలు చేపడుతున్నప్పటికీ ప్రజలు కూడా సహకరించి దోమల వృద్ధి కేంద్రాలు లేకుండా చూడాలన్నారు. ప్రధానంగా నీటి నిల్వలు లేకుండా ప్రతిరోజు శుభ్రపరచుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలలో ఉన్న టిఫిన్ దుకాణాల వద్దకు వెళ్లి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అలాగే కాటవీధి పాఠశాలకు చేరుకుని విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే దోమలు వల్ల సంక్రమించే రోగాల గురించి తెలుసుకోవాలన్నారు. నేటి నుంచి విద్యార్థులు తమ ఇళ్లల్లో నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని శుభ్రపరచుకోవాలని సూచించారు. నిరుపయోగంగా పడి ఉన్న టైర్లలో, కొబ్బరి చిప్పలలో, గుంతలలో, ఎయిర్ కూలర్లలో ఎక్కువగా నీరు నిల్వ ఉండిపోతుందని అవే దోమలకు వృద్ధి కేంద్రాలుగా నిలుస్తున్నాయని వివరించారు. వారంలో ఒకరోజు డ్రై డే పాటించాలని అయితే ప్రస్తుతం ఇబ్బందికర పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ప్రతిరోజు వ్యర్థనీటిని ప్రక్షాళన చేయాలని చెప్పారు. దోమలు వృద్ధి కాకుండా తాము కుంటలలో, చెరువులలో ఇప్పటికే ఆయిల్ బాల్స్ వేసామని, అలాగే యాంటీ లార్వా ఆపరేషన్‌ను ముమ్మరం చేసామని చెప్పారు. అనేక ప్రాంతాలలో ఫాగింగ్ యంత్రాలతో దోమల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు తప్పనిసరిగా వాడుకోవాలని అన్నారు. చిన్నపిల్లల పట్ల మరింత జాగ్రత్తగా ఉండి దోమలు దరిచేరకుండా చూడాలన్నారు. ఆయన వెంట పారిశుద్ధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రైతుల అందోళన



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి సమస్యను వివరిస్తున్న రావాడ గ్రామానికి చెందిన రైతులు

భోగాపురం: తమ పేర్ల మీద రికార్డులను అనర్హుల పేర్లపై ఎలా రిజిస్ట్రేషన్లు చేశారంటూ రావాడ గ్రామానికి చెందిన బాధిత రైతులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన కొందరు రైతులు టీడీపీ నాయకులు దంతులూరి సూర్యనారాయణరాజు, మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణతో కలిసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు వచ్చి తమ రెవెన్యూ పరిధిలో 8 మందికి పైగా రైతులు అనుభవంలో ఉన్న జిరాయితీ భూమిని ఇతరుల పేరు మీదకు మార్పు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రధానంగా కొందరు లేఖరుల ద్వారానే ఇలాంటివి జరుగుతున్నాయని, ప్రతి ఒక్క రికార్డును చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. దీనిపై సెల్‌ఫోన్ ద్వారా సెలవులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ శ్రావణకుమార్‌ను వివరణ కోరగా రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆన్‌లైన్‌లో ఉన్న రైతులు తమ భూములను వేరే వ్యక్తులకు అమ్మకం చేసేందుకు రావడంతో రికార్డులు పరిశీలించి రిజిస్ట్రేషన్ చేశామని తెలిపారు.

కొండగుంపాంలో శిక్షా సప్తాహ్ వారోత్సవాలు



కాగితపు సంచులను చూపిస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: నూతన జాతీయ విద్యా విధానం లక్ష్యాలను మరింత విస్తృతం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న శిక్షా సప్తాహ్ వారోత్సవాలు కొండగుంపాం ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిపుణ్ భారత్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్థానికంగా లభించే వనరులతో తయారు చేసిన కాగితపు సంచులను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సతివాడలో నేత్ర వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య సిబ్బంది మొత్తం 56 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 24 మందిని ఉచిత కంటి చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన హోంగార్డుల అసోసియేషన్ సభ్యులు



ఎస్పీ వకుల్ జిందాల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న హోంగార్డుల అసోసియేషన్ అధ్యక్షుడు తదితరులు

విజయనగరం క్రైమ్: నూతనంగా జిల్లాకు వచ్చిన ఎస్పీ వకుల్ జిందాల్‌ను జిల్లా హోంగార్డుల అసోసియేషన్, కోఆపరేటివ్ సొసైటీ తరఫున ఆ సంఘ సభ్యులు జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హోంగార్డుల అసోసియేషన్ అధ్యక్షుడు పడగల బంగార్రాజు ఆధ్వర్యంలో హోంగార్డులు ఎదుర్కొంటున్న తమ సమస్యల్ని విన్నవించారు. అనంతరం ఎస్పీ, హోంగార్డుల సమస్యలు, కోఆపరేటివ్ సొసైటీ సమస్యల మీద త్వరలో చర్చించి చర్యలు తీసుకుంటామని, తగిన సూచనలు, సలహాలిచ్చి, హోంగార్డులు అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారన్నారు. కార్యక్రమంలో హోంగార్డుల జిల్లా కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పి.సుశీల, సభ్యులు, డైరెక్టర్‌లు మహేష్, పతివాడ శంకరరావు, రమణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నీరు తాగేదెలా...

- కార్పొరేషన్ కుళాయిల ద్వారా రంగు మారిన నీరు
- మూడు రోజులుగా ఇబ్బందులు పడుతున్న నగర ప్రజలు



కార్పొరేషన్ కుళాయి ద్వారా సరఫరా అయిన రంగు మారిన తాగునీరు

విజయనగరం: మానవుడు నిత్య జీవితంలో సంక్రమించే వ్యాధుల్లో అధిక శాతం వాళ్లు తీసుకునే నీటి ద్వారానే సంక్రమిస్తాయని వైద్యులు చెబుతుంటారు. జీవకోటికి ప్రాణాధారమైన అటువంటి నీరు కలుషితమైతే ఇక మనుగడే కష్టతరంగా మారుతోంది. అటువంటి పరిస్థితి ఏ మారుమూల పల్లెటూరు ప్రాంతంలో జరుగుతుందంటే అక్కడి ప్రజల అవగాహన లోపం.. అధికారుల నిర్లక్ష్య వైఖరని భావించుకోవచ్చు. జిల్లా కేంద్రమైన విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అటువంటి పరిస్థితులు తరుచూ ఉత్పన్నమవుతుండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. నగర పరిధిలోని ఏదో ఒక ప్రాంతంలో నిత్యం రంగు మారిన నీరు సరఫరా కావటంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి వ్యాధులు ప్రబలే వర్షాకాలంలో స్వచ్ఛమైన తాగునీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

50 డివిజన్‌లలో విస్తరించి ఉన్న విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 3 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నట్లు అంచనా. నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు నెల్లిమర్ల, రామతీర్థం, ముషిడిపల్లి రక్షితమంచి నీటి పథకాల నుంచి ప్రతి రోజు 27 ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేస్తున్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఆ మొత్తాన్ని నగరంలోని 40 రిజర్వాయర్‌లకు పంపింగ్ చేసి అక్కడి నుంచి కుళాయిల ఒక రోజు 25 డివిజన్‌లకు, మరో రోజు 25 డివిజన్‌లకు నీటిని అందిస్తున్నారు. ఇందులో నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచి నీటి పథకాల వద్ద 8 బావుల నుంచి 17 ఎంఎల్‌డీ నీటిని పంపింగ్ చేస్తుండగా.... ముషిడిపల్లి వద్ద ఉన్న 10 బావులు నుంచి మరో 10 ఎంఎల్‌డీ నీరు పంపింగ్ అవుతుంది. ఇటీవల వర్షాలు కురవటంతో ముషిడిపల్లి రక్షిత మంచి నీటి పథకం వద్ద గల ఊట బావుల్లోకి బురద నీరు చేరుతుండగా... ఆ నీటిని పంపింగ్ చేసి సరఫరా చేస్తుండటంలో ఇబ్బందులు తలెత్తున్నాయి. దీంతో నగరంలోని శాంతినగర్, బీపీఎం హైస్కూల్ ప్రాంతం, కుప్పిలివీధి తదితర ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. వాస్తవానికి ఊట బావుల్లోకి బురద నీరు చేరే సమయంలో పంపింగ్ చేసే నీటిని రిజర్వాయర్‌లలో ఆలమ్ ద్రావణం వేసిన తరువాత కొద్ది గంటలు నిల్వ ఉంచిన తరువాత సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం పంపింగ్ చేస్తున్న నీటికి, నగర ప్రజలకు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేసేందుకు అవసరమైన నిల్వలకు మధ్య వ్యత్యాసం ఉండటం పెద్ద సమస్యగా మారుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఊట బావుల నుంచి రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేసే నీటిని ఎక్కువ సమయం నిల్వ ఉంచేందుకు ఆస్కారం లేకపోవటంతో ఆలమ్ ద్రావణం వేసిన నీటిని వెంటనే సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారు. ఫలితంగా కార్పొరేషన్ కుళాయిల ద్వారా సరఫరా చేసే నీరు రంగు మారి వస్తుంది. ఈ విషయమై కార్పొరేషన్ కమిషనర్ వద్ద ప్రస్తావించగా గడిచిన కొద్ది రోజులుగా వర్షాలు కురవటంతో ఈ సమస్య తలెత్తుతుందని, సమస్య పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



చదురుగుడిలో ప్రత్యేక పూల అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి చదురుగుడి, వనంగుడిలలో ప్రత్యేక కుంకుమార్చనలను నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావి చెట్ల వద్ద దీపారాధనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు.

• ఇది చెరువే..



విజయనగరం జిల్లా కేంద్రంలోని ధర్మపురి గ్రామ సమీపంలో గల చెరువు గుర్రపు డెక్కతో పూర్తిగా నిండిపోయింది. స్థానికులకు అది చెరువు అనే ఒక ఆలోచన తప్ప ఇతర ప్రదేశాల నుంచి వచ్చేవారికి పచ్చదనం పరుచుకున్నట్టు అందంగా కనిపిస్తోంది. చెరువు ఆనవాలు కూడా కనిపించకుండా గుర్రపు డెక్క ఎంతగా ఆవరించిందో ఈ చిత్రంలో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

నువ్వు పంట నష్టంపై నివేదిక



నువ్వు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు నిర్మల, సంగీత

దెంకాడ: మండలంలో దెబ్బతిన్న నువ్వు పంట నష్టంపై ఉన్నతాధికారులకు ప్రాథమిక నివేదిక పంపిస్తామని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల తెలిపారు. మండలంలోని చొల్లంగిపేట, నగరపుపేట గ్రామాల్లో దెబ్బతిన్న నువ్వు పంటను ఏఓ నిర్మల, జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏఓ టి.సంగీతలు మంగళవారం పరిశీలించారు. గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు పండిన నువ్వు పంటకు నష్టం జరిగిందన్నారు. పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లతామని రైతులకు చెప్పారు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

రైతులు వరి నారుమడి యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని వ్యవయాసాధికారులు నిర్మల, సంగీతలు అన్నారు. మండలంలోని చొల్లంగిపేట గ్రామంలో పర్యటించి వరి నారు మడులను పరిశీలించారు. ఎకరా నారుమడికి కాకారాబో ఫ్యూరన్ 3జీ గుళికలను 2 కేజీల యూరియాలో కలిపి వేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఇ.లలిత, సర్పంచ్ కోరాడ కనకరాజు, రైతులు పాల్గొన్నారు.

రోగులను సకాలంలో ఆస్పత్రికి తరలించాలి

- ఎన్టీఆర్ వైద్య సేవ కో ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు



108 అంబులెన్సు రికార్డు పరిశీలిస్తున్న డాక్టర్ అప్పలరాజు

విజయనగరం ఫోర్ట్: 108 అంబులెన్సుల ద్వారా రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్చాలని ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు అన్నారు. స్థానిక సర్వజన ఆస్పత్రి ఆవరణలో 108 అంబులెన్సును ఆయన మంగళవారం తనిఖీ చేశారు. 108 అంబులెన్సులో సౌకర్యాలు పూర్తి స్థాయిలో ఉన్నాయో లేదోనని పరిశీలించారు. వాహనాన్ని తీసే ముందు ప్రతి రోజు కండిషన్ చూసుకోవాలన్నారు. ఆపదలో ఉన్నామని ఫోన్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవాలన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



కొత్తవలస: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి విజయచంద్ర



గుర్ల: విద్యార్థులకు అవగాహనకల్పిస్తున్న ఎస్ఐ భాస్కరరావు

కొత్తవలస: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల జోలికిపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయచంద్ర సూచించా రు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై మండల లీగల్ సెల్ కమిటీ ఆధ్వ ర్యంలో స్థానిక కోటపాడు రోడ్డులోని ప్రగతి డిగ్రీ కళాశాలలో మంగ ళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అతిథిగా హాజ రైన జూనియర్ సివిల్ జడ్జి విజయచంద్ర మాట్లాడుతూ ప్రతీ ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత భవిష్యత్ ఉంటుందని, చెడు వ్యసనాలకు బానిసగా మారితే భవిష్యత్ నాశనమవుతుందన్నారు. మాదక ద్రవ్యా లు వినియోగించినా, రవాణా చేసినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధన కోసం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. న్యాయవాదులు శ్రీనివాసరావు, మహేష్, శ్రీరామ్మూర్తి, ఏఎస్ఐ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

గుర్ల: విద్యార్థులు చెడు అలవాట్లు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించాలని ఎస్ఐ భాస్కరరావు సూచించారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థా లపై మండలంలోని కెల్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యుక్త వయస్సులో మత్తుపదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ నాశనం కావడంతో పాటు ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.